

ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
పశ్చిమ గోదావరి
జిల్లా వార్తలు
5
గురువారం 5 సెప్టెంబరు 2024





యలమంచిలి మండలం చించినాడ వద్ద ఏటిగట్టు

ఏటిగట్టు పనులు గాలికొదిలేశారు

- గత వైసీపీ ప్రభుత్వ నిర్వాకం
- భారీ వరద వస్తే ముప్పు

యలమంచిలి, సెప్టెంబరు 4: వర్షాకాలం గోదావరి పరీవాహక ప్రాంత వాసులను వరద భయం వెంటాడుతుంది. లంక గ్రామాలు ముంపు బారిన పడతాయి. మండలంలోని పలుచోట్ల ఏటిగట్టు తక్కువ ఎత్తులో ఉండడం, మరికొన్నిచోట్ల బలహీనంగా ఉండడంతో ఏటిగట్టు వెలుపల గ్రామాల ప్రజలు భయంతో వణుకుతున్నారు. గడచిన ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం ఏటిగట్టును పటిష్టం చేయడం, ఎత్తు పెంచడంలో ఎలాంటి చర్యలు చేపట్టకుండా గాలికొదిలేసింది. వరదల సమయంలో తాత్కాలిక పనులు చేపట్టడం.. వరద తగ్గిన తరువాత ఏటిగట్టు పటిష్టతను పట్టించుకున్న నాధుడే కరువయ్యారని స్థానికంగా విమర్శలు వినిపించాయి.

2007లో అప్పటి ప్రభుత్వం ఏటిగట్టు పటిష్టతకు పనులు ప్రారంభించి దాదాపు 2011లో పనులు ముగించారు. మండలంలోని వాకలగరువు, దొడ్డిపట్ల, అబ్బిరాజుపాలెం, గంగడపాలెం, లక్ష్మీపాలెం, యలమంచిలి, చించినాడ గ్రామాల్లో కొన్నిచోట్ల ఏటిగట్టు ఎత్తు పెంచకుండా వదిలేశారు. వాకలగరువు, దొడ్డిపట్ల ప్రాంతంలో సుమారు 700మీటర్ల మేర, అబ్బిరాజుపాలెం, గంగడపాలెం, లక్ష్మీపాలెం, యలమంచిలి, చించినాడ గ్రామాల పరిధిలో సుమారు 1.8 కిలోమీటర్ల మేర ఏటిగట్టు ఎత్తును పెంచి పటిష్టం చేయాల్సి ఉంది. భారీ వరద వస్తే గట్టుపై నుంచి పొంగిపొర్లే ప్రమాదం ఉందని స్థానికులు వాపోతున్నారు. 2022లో భారీ వరద సమయంలో ఇదే పరిస్థితి ఏర్పడింది. ప్రజలు, యువత ఏటిగట్టుపై ఇసుక బస్తాలు వేసి వరద ముప్పును అడ్డుకున్నారు. ఇంత జరిగినా అప్పటి వైసీపీ ప్రభుత్వం శాశ్వత ప్రాతిపదికన ఏటిగట్టు పనులు చేపట్టిన దాఖలాలు లేవు.




ఆచంట మండలం కోడేరు వద్ద పెరుగుతున్న గోదావరి

ఎన్డీఏ కూటమి ప్రభుత్వంలో జల వనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు చొరవతో మండలంలో ఏటిగట్టు పటిష్టతకు హెడ్‌వర్క్స్ అధికారులు రూ.6.7 కోట్లతో ప్రతిపాదనలు చేశారు. తాత్కాలికంగా ఏటిగట్టు పనులు చేపట్టేందుకు రూ.కోటి నిధులు మంజూరయ్యాయి. వర్షాలు తగ్గిన అనంతరం ఈ పనులు చేపడతామని హెడ్‌వర్క్స్ ఏఈ కె.సుబ్బారావు తెలిపారు.

వరద గోదారి



పోలవరం స్పిల్ వే వద్ద గోదావరి ఉధృతి



నరసాపురం వద్ద వశిష్ఠ

వశిష్ఠకు పెరుగుతున్న ఉధృతి.. బిక్కుబిక్కుమంటున్న లంక గ్రామాలు

- అధికార యంత్రాంగం అప్రమత్తం
- 5 వేల ఇసుక బస్తాలు సిద్ధం
- స్లూయిస్‌లు బలహీనం
- సబ్ కలెక్టర్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్

గోదావరి వరద ఉధృతి పెరుగుతోంది. భద్రాచలం వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక ప్రకటనతో దిగువ లంక గ్రామాల ప్రజలు భయపడుతున్నారు. భద్రాచలం, ధవళేశ్వరం వద్ద గోదావరి నీటి మట్టం పెరిగితే సముద్రంలోకి విడుదల చేసిన జలాలతో గోదావరి మరింత పోటెత్తింది. లంక గ్రామాలు, తోటలు నీట మునుగుతాయి. వారం రోజుల నుంచి కురిసిన వర్షాలకు జిల్లాలో పలుచోట్ల వరి నారుమడులు కొట్టుకుపోయాయి. తేరుకుంటున్న సమయంలో మళ్లీ వాయుగుండం హెచ్చరికతో రైతులు కుదేలయ్యారు. గోదావరి వరద హెచ్చరికతో లంక గ్రామాల ప్రజల కంటిమీద కునుకు లేదు. జూలైలో సుమారు పది రోజుల పాటు గోదావరికి వరద తాకింది. మరోసారి వరద నీరు పోటెత్తడంతో తీర ప్రాంతాల వారు ఆందోళన చెందుతున్నారు.

నరసాపురం/ఆచంట/పెనుగొండ, సెప్టెంబరు 4: వశిష్ఠా గోదావరికి బుధవారం ఎగువ నుంచి 2 లక్షల క్యూసెక్కుల నీటిని విడిచిపెట్టారు. పరీవాహక ప్రాంతాల్లో గోదావరి ఉధృతంగా ప్రవహిస్తోంది. అప్రమత్తమైన మత్స్యకారులు గోదావరిలో కట్టిన వలకట్లను తొలగించుకున్నారు. ధవళేశ్వరం వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేసే అవకాశం ఉండడంతో అధికారులు కూడా అప్రమత్తమయ్యారు. జిల్లాలో దొంగరావిపాలెం నుంచి నరసాపురం వరకు సుమారు 60 కిలోమీటర్ల మేర ఏటిగట్టు విస్తరించింది. 1986 వరదలను పరిగణలోకి తీసుకుని 2007లో ఏటిగట్టు ఎత్తుచేసి పటిష్ఠం చేశారు. ఇంకా 11 కిలోమీటర్లు పనులు చేపట్టాల్సి ఉంది. అధికారుల లెక్కల ప్రకారం దొడ్డిపట్ల, యలమంచిలి, నరసాపురం మండలంలోని రాజుల్లంక, బియ్యపుతిప్ప వద్ద గట్టును ఎత్తు చేయాల్సి ఉంది. 2022 వరదలకు దొడ్డిపట్ల వద్ద నీరు బయటకొచ్చింది. ఈ ఏడాది వరదకు ఎటువంటి ప్రమాదం వాటిల్లలేదు. జూలైలో వరదలకు ధవళేశ్వరం నుంచి సుమారు 18 లక్షల క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. వశిష్ఠకు 9 లక్షల క్యూసెక్కులు రావడం ముప్పు తప్పింది. మరోసారి వరద తాకడంతో అధికారులు ముందుస్తు చర్యలకు సన్నద్ధమయ్యారు.

ఇసుక బస్తాలు సిద్ధం

ఏటిగట్టు పరిరక్షణకు 5వేల ఇసుక బస్తాలను సిద్ధం చేశారు. వాటిలో 1500 బస్తాలను గట్టు బలహీనంగా ఉన్న దొడ్డిపట్లకు తరలించారు. యలమంచిలి, నరసా పురం మండలాల్లో ఏటిగట్టు వద్దకు కూడా బస్తాలను తరలించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. మరోవైపు స్లూయిస్‌లను కూడా ప్రమాదభరితంగా ఉన్నాయి. వరద తాకగానే వీటిని మూసివేసేందుకు చర్యలు చేపడుతున్నారు. తలుపుల లీకేజీలు ఉన్న చోట్ల ఇసుక బస్తాలను అడ్డుకట్ట వేయాలని భావిస్తున్నారు. మొదటి ప్రమాద హెచ్చ రిక జారీ చేయగానే ఉభయగోదావరి జిల్లాల మధ్య నరసాపురం- సఖినేటిపల్లి రేవు ల్లో రాకపోకలు నిలిపివేయాలని నిర్ణయించారు. ఏటిగట్టు పర్యవేక్షణాధికారి సుబ్బారావు ఆధ్వర్యంలో సిబ్బంది గట్టు బలహీనంగా ఉన్న ప్రదేశాలను గుర్తించారు. ఆర్డీవో అంబరీష్ అధికారులు అప్రమత్తం కావాలని ఆదేశాలు జారీ చేశారు. 9391185874 నెంబర్‌తో సబ్ కలెక్టర్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. సిద్ధాంతం వద్ద గోదావరి వరద ఉధృతిని పెనుగొండ సీఐ రజనీకుమార్, ఎస్ఐ కె.గంగాధరరావు పరిశీలించారు. గోదావరి ఉధృతితో లంక రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గోదావరిలో స్నానాలకు ఎవరు దిగవద్దని తెలిపారు. కోడేరు, పెదమల్లం, కరుగోరుమిల్లి, భీమలాపురంలో పుష్కరఘాట్‌లు నీట మునిగాయి. మరింత ఉధృతమవుతుందని అధికారులు ముందస్తు చర్యలు చేపడుతున్నారు.

కర్రలు.. తడికలు



నరసాపురం వద్ద కోతకు గురైన ఏటిగట్టు

2022 వరదలకు నరసాపురం వద్ద ఏటిగట్టు సుమారు 400 మీటర్లు కొట్టుకుపోయింది. ప్రస్తుతం 150 పనులు పూర్తి చేశారు. మిగిలిన పనులు పెండింగ్‌లో ఉన్నాయి. తాత్కాలికంగా నరుగుడు కర్రలు, తడికెలు పెట్టి అడ్డుకట్ట వేశారు. వరద భారీగా వస్తే గట్టు తెగుతుందని పట్టణ వాసులు భయపడుతున్నారు.

భద్రాచలం వద్ద 44.3 అడుగుల నీటి మట్టం

వేలేరుపాడు, కుక్కునూరు, సెప్టెంబరు 4: భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం 43 అడుగులకు చేరడంతో మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. బుధవారం సాయంత్రానికి 44.3 అడుగుల నీటి మట్టం నమోదైంది. తెలంగాణ ఎగువన ప్రాజెక్టులన్నీ నిండి ఉండడంతో నీటిని కిందికి విడుదల చేశారు. ఏలూరు జిల్లా జేసీ ధాత్రిరెడ్డి కుక్కునూరు మండలంలో ముంపు ప్రభావిత గొమ్ముగూడెంలో పరిశీలించారు. ప్రజలను పునరావాస కాలనీకి వెళ్లేందుకు సిద్ధంగా ఉండాలని సూచించారు. ఇబ్బందులు ఎదురైతే సమాచారం ఇవ్వాలన్నారు. పునరావాస కేంద్రంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని జేసీ పరిశీలించారు. వేలేరుపాడు మండలంలోని లోతట్టు గ్రామాల ప్రజలను అధికారులు అప్రమత్తం చేస్తున్నారు. వేలేరుపాడు, రుద్రమ్మకోట మధ్య రహదారిపై వరద నీరు చేరింది. వేలేరుపాడు, కోయిద రహదారి మధ్య ఎద్దువాగు, టేకూరువాగు బ్రిడ్జిపై వరద చేరడంతో రాకపోకలు స్తంభించిపోయాయి.



యలమంచిలి మండలం ఆర్యపేటలో నీట మునిగిన వరి చేను

వీడని వర్షంతో ముంపు

భీమవరం టౌన్, సెప్టెంబరు 4: బంగాళాఖాతంలో వాయుగుండంతో కురుస్తున్న భారీ వర్షాలతో పల్లపు ప్రాంతాలు నీట మునిగాయి. ఐదు రోజు లుగా కురుస్తున్న వర్షాలకు వరి చేలు ముంపు బారిన పడ్డాయి. తేరుకుంటు న్నంతలో మంగళవారం తెల్లవారుజాము నుంచి బుధవారం మధ్యాహ్నం వరకు ఏకాధాటిగా కురిసిన వర్షంతో జనజీవనం స్తంభించింది. కూలీ పనులు లేక పేదలు ఇబ్బందులు పడుతున్నారు. చిల్లర వ్యాపారాలు మందగించాయి. భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ చెప్పడంతో మరింత ఆందోళన వ్యక్తం అవుతోంది.

జిల్లాలో వర్షపాతం

జిల్లాలో గడచిన 24 గంటలలో వర్షపాతం ఇలా ఉంది. తాడేపల్లిగూడెం 28.8 మి.మీ. వర్షపాతం నమోదు కాగా పెంటపాడులో 21.2, తణుకు 56, అత్తిలి 15.4, గణపవరం 27.8, ఆకివీడు 2.4, ఉండి 22.2, పాలకోడేరు 21.8, పెనుమంట్ర 42.6, ఇరగవరం 32.4, పెనుగొండ 19.8, ఆచంట 26, పోడూరు 22.4, వీరవాసరం 20.2 భీమవరం 28.8, కాళ్ళ 41.2, మొగల్తూరు 19.4, నరసాపురం 16.8, పాలకొల్లు 46, యలమంచిలిలో 16.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

11,890 ఎకరాల్లో మునిగిన వరి

భీమవరం రూరల్ / పాలకొల్లు రూరల్ / యలమంచిలి / ఆకివీడు, సెప్టెంబరు 4: భారీ వర్షాలతో వరి చేలు ముంపు బారినపడ్డాయి. జిల్లాలో బుధవారం నాటికి 11,890 ఎకరాల్లో ముంపు బారిన పడినట్లు వ్యవసాయాధికారుల అంచనా. మరో రెండు రోజులు పాటు భారీ వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ సూచించడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పాలకొల్లు రూరల్ మండలంలో పలు గ్రామాల్లో పల్లపు ప్రాంతాలు జలమయం అయ్యాయి. దగ్గులూరులో యానాది వారి కాలనీ (పుంత)లో 110ఎకరాలు పూర్తిగా నీటిలో మునిగింది. భగ్గేశ్వరం డ్రెయిన్ దిగువన మరో 25 ఎకరాలు నీట మునిగాయి. ఆగర్రు, ఆగర్తిపాలెం, వెలివెల, కొత్తపేట, దిగమర్రు, వరధనం కాపవరం, అరట్లకట్ట, శివదేవుని చిక్కాల, తిల్లపూడి తదితర గ్రామాల్లో రైతులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. యలమంచిలి మండలంలో సుమారు 1200 ఎకరాలు నీట మునిగాయి. వీడని వర్షంతో నీరు బయటకు మళ్లించే అవకాశం లేదని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెండు సార్లు వేసిన నారు, నాట్లు కూడా మునగడంతో రైతులు తీవ్రనష్టాలను చవిచూడాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. ఒకపక్క భారీవర్షాలు, మరోపక్క గోదావరికి వరదనీరు పెరుగుతున్న నేపథ్యంలో మరిన్ని రోజులు ఇదే పరిస్థితి కొనసాగితే వరినాట్లు పూర్తయిన చేలన్నీ నీటమునిగే ప్రమాదం పొంచి ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఆకివీడు మండలంలో 960 ఎకరాల్లో వరి చేలు నీట మునిగినట్లు ఏవో ప్రియాంక తెలిపారు.



ఎన్టీఆర్ జిల్లాలో ముంపు బాధితుల సహాయార్థం జిల్లా నుంచి ఆహార పొట్లాలు ప్రత్యేక వాహనంలో తరలించారు. జిల్లా కలెక్టర్ నాగరాణి, ఎమ్మెల్యే పులపర్తి అంజిబాబు వాహనాలు ప్రారంభించారు.

-7లో

ముంపుటేరు



దుంపగడప వద్ద గట్లను తాకుతూ ప్రవహిస్తున్న ఉప్పుటేరు

నీటి ప్రవాహానికి తూడు, కిక్కిస అడ్డంకి

ఆకివీడు రూరల్, సెప్టెంబరు 4 : ముంపు నీటిని నేరుగా సముద్రంలోకి చేర్చే ఉప్పుటేరు ముంపుటేరుగా మారింది. అధికారులు, గత పాలకులు నిర్లక్ష్యంతో ఉప్పుటేరు ప్రజలకు శాపంగా పరిణమించింది. బుడమేరు, తమ్మిలేరు పొంగి వరద నీరు నేరుగా ఉప్పుటేరు ద్వారా సముద్రంలోనికి వెళ్ళాల్సి ఉంది. ఆకివీడు మండలం దుంపగడప సమీపంలో రెండు రైల్వే వంతెనల వద్ద గుర్రపుడెక్క, తూడు, కిక్కిస వలన నీటి ప్రవాహం వెనక్కి తన్ని ముంపు ప్రమాదం పెరుగుతున్నది. బుధవారం దుంపగడపలోని పల్లిపాలెం వద్ద గట్లను తాకుతూ ఉధృతంగా ప్రవహిస్తున్నది. గత ప్రభుత్వ హయాంలో ఇవి తొలగించడంలో చూపించిన నిర్లక్ష్యానికి నేడు రైతులకు, ప్రజలకు శాపంగా మారింది. రైల్వే బ్రిడ్జిల వద్ద 7 ఖానాలుండగా రెండు ఖానాల నుంచి మాత్రమే నీరు ప్రవహిస్తోంది. ఎగువ నుంచి వస్తున్న వరద నీరు రోజు రోజుకు పెరుగుతోంది. రాబోయే రెండు రోజులలో ఉప్పుటేరు మరింత ఉధృతంగా ప్రవహిస్తుందని, ఉండి, కైకలూరు, ఉంగుటూరు, ఏలూరు, దెందులూరు నియోజక వర్గాలపై ప్రభావం తీవ్రంగా ఉంటుందని స్థానికులు చెబుతున్నారు. 2020 అక్టోబరులో ఇదే పరిస్థితి నెలకొనడంతో అప్పటి ప్రభుత్వం సరియైన నిర్ణయం తీసుకోలేదు. దీనితో ఆకివీడు మండలంలోని పలు గ్రామాలు, పంటపొలాలు, ఆక్వా చెరువులు ముంపుబారిన పడి ప్రజలు తీవ్రంగా నష్టపోయారు. ఎమ్మెల్యేలు రఘు రామకృష్ణరాజు, చింతమనేని ప్రభాకర్ ఉప్పుటేరును పరిశీలించి సీఎం దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు.



యండగండిలో ఉధృతంగా ప్రవహిస్తున్న యనమదుర్రు డ్రెయిన్

ఉధృతంగా యనమదుర్రు డ్రెయిన్

ఉండి: భారీ వర్షాలు, ఎగువ నీటితో యనమదుర్రు డ్రెయిన్ ఉధృతంగా ప్రవహిస్తోంది. సమీపంలో వరి చేలు నీట మునుగుతున్నాయని రైతులు వాపోతున్నారు. మరో తుఫాన్ హెచ్చరికతో కంగారు పడుతున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నాగరాణి, జేసీ

ముందస్తు ప్రణాళికలతో సిద్ధంగా ఉండాలి

అధికారులకు కలెక్టర్ నాగరాణి ఆదేశం

భీమవరం టౌన్, సెప్టెంబరు 4: అధిక వర్షాలు, వరదలను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు ముందస్తు ప్రణాళికలతో అధికారులు సిద్ధంగా ఉండాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి ఆదేశించారు. కలెక్టరేట్‌లో జిల్లా అధికారులతో బుధవారం సమీక్షించారు. ఇరిగేషన్ అధికారులు అనుక్షణం అప్రమత్తంగా ఉండాలన్నారు. గట్లు బలహీనంగా ఉన్నచోట్ల పటిష్ట పరచడానికి చర్యలు తీసుకోవాలన్నారు. తూడు, కిక్కిస తొలగింపు పనులను వేగవంతం చేయాలన్నారు. ఏఈలు క్షేత్ర స్థాయిలో పర్యవేక్షణ చేయాలన్నారు. పౌరసరఫరాల అధికారులు కొవ్వొత్తులు, అగ్గిపెట్టెలు పెద్ద ఎత్తున సరఫరా చేసే వెండర్స్‌ను గుర్తించి సిద్ధంగా ఉండాలన్నారు. మెట్లు లేని ఓహెచ్ఆర్ఎస్ ట్యాంకులను గుర్తించి పంచాయతీ నిధులతో వెంటనే మెట్లను ఏర్పాటు చేయాలన్నారు. మునిసిపల్ ప్రాంతాల్లో రోడ్లపై గుంతలలో నీరు నిలిచిన ప్రాంతాలను గుర్తించి వెంటనే నీరు తొలగించే చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో జ్వరాల నివారణకు పారిశుద్ధ్యం మెరుగుపరచాలని ఆదేశించారు. పంచాయతీల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలను డీపీవో, డీఎల్‌డీవోలు పర్యవేక్షించాలని ఆదేశించారు. వైద్యాధికారులు పెద్ద ఎత్తున అవగాహన ప్రచార కార్యక్రమాలను నిర్వహించా లన్నారు. ప్రతి అధికారి, సచివాలయ సిబ్బంది క్షేత్రస్థాయిలోనే ఉండాలని ఆదేశించారు. పంట పొలాల్లో నీరును తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో జేసీ టి.రాహుల్ కుమార్‌రెడ్డి, డీఆర్వో జె.ఉదయభాస్కరరావు, డీపీవో విక్టర్, ఆర్డీవోలు పాల్గొన్నారు.

ప్రకృతి విపత్తు సమయంలో రాజకీయాలా..

జగన్ తీరుపై కేంద్రమంత్రి శ్రీనివాస వర్మ ఫైర్

భీమవరం టౌన్, సెప్టెంబరు 4 : ప్రకృతి వైపరీత్యాలు సమయంలో మాజీ సీఎం జగన్ రెడ్డి రాజకీయాలు మాట్లాడడం సబబు కాదని కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ అన్నారు. భీమవరంలో బీజేపీ సభ్యత్వ నమోదు సందర్భంగా బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జగన్ సీఎంగా వైఫల్యం చెందడంతో ప్రజలు 11 సీట్లతో సరిపెట్టారని గుర్తు చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఫుల్ టైం అక్కడే ఉండి పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారన్నారు. విపత్తు సమయంలో ప్రజలకు సహాయం అందించేందుకు అన్ని రాజకీయ పార్టీలు కలిసి పని చేయాలన్నారు. సంక్షేమ పథకాలు ముసుగులో వైసీపీ ప్రభుత్వం మౌలిక సదుపాయాలు కల్పించకుండా నిర్లక్ష్యం చేసిందని మంత్రి శ్రీనివాసవర్మ మండిపడ్డారు. రాష్ట్రంలో విపత్తును ఎదుర్కొనేందుకు కేంద్రం అండగా ఉంటుందన్నారు. బుధవారం నుంచి 45 రోజుల వరకు సభ్యత్వ నమోదు కార్యక్రమం జరుగుతుందన్నారు.

8800002024 నెంబర్‌కు మిస్డ్ కాల్ ఇవ్వడం ద్వారా నమోదు చేయించుకోవచ్చన్నారు. జిల్లాలో పార్టీ కార్యకర్తలు, నాయకులను అభిమానులు పెద్ద ఎత్తున సభ్యత్వ నమోదు చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి పేరిచర్ల సుభాష్, అసెంబ్లీ కన్వీనర్ కాగిత సురేంద్ర, జిల్లా ప్రధాన కార్యదర్శులు కోమటి రవికుమార్, కొవ్వూరు వెంకటరెడ్డి, పులపర్తి వెంకటేశ్వరరావు కోట రాంబాబు, అడబాల శివ కలిదిండి వినోద్‌వర్మ, ఒబిలిశెట్టి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు నార్ని తాతాజీ నుంచి కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ పార్టీ సభ్యత్వం తీసుకున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ

ఉత్తమ ఉపాధ్యాయులు వీరే

నేడు అవార్డుల అందజేత

భీమవరం ఎడ్యుకేషన్, సెప్టెంబరు 4 : పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో గురుపూజోత్సవాన్ని గురువారం నిర్వహిస్తున్నట్లు డీఈవో నాగమణి బుధవారం తెలిపారు. ఉదయం పది గంటలకు ఎస్ఆర్‌కెఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు అధ్యక్షతన జరిగే కార్యక్రమంలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన వారిని సన్మానించనున్నారు.

ప్రధానోపాధ్యాయులు

కె.వెంకటరావు, ఎంపీఎల్ హైస్కూల్, చినరంగనిపాలెం, బి.సుబ్బారావు, జెడ్పీహెచ్ఎస్, ఆలమూరు, కె.రాజశేఖర్, జెడ్పీహెచ్ఎస్ మత్స్యపురి, డీవీఎస్ఎస్‌వీ.ప్రసాదరాజు ఎల్ఎఫ్ఎల్, వేంద్ర, డి.ఝాన్సీ విజయకుమారి ఎల్ఎఫ్ఎల్, మెట్టఉప్పరగూడెం, జి.శ్రీనివాస్ ఎల్ఎఫ్ఎల్, హెచ్ఎం, లంకలకోడేరు

స్కూల్ అసిస్టెంట్స్

బి.చంద్రశేఖర్, దండగర్ర, ఎ.మాణిక్యమ్మ, మండపాక, ఆర్‌వి సూర్యనారాయణ, ఇరగవరం, ఎస్.శామ్యూల్ జాన్సన్, కావలిపురం, పి.రాధాకృష్ణ, దువ్వ, ఎన్‌బి.రత్నకుమారి, కోపల్లె, పి.హరిబాబు, మాముడూరు, ఎం.బాలరాముడు, పెదకాపవరం, డి.చైతన్య, కాళీపట్నం, ఎస్.సూర్యనారాయణ, మీనవల్లూరు, జీఎన్.మారేశ్వరరావు, వడలి, డి.మల్లికార్జునరావు, బల్లిపాడు, టి.వినోద, జేఎస్ఎం జేపీ గరల్స్ హైస్కూల్, తణుకు, వై.సత్యనారాయణ, యలమంచిలి, కె.రామామోహన్‌రావు, చంద్రరాజు చెరువు, వి.సూర్యకుమార్, వేంద్ర, వి.కిషోర్ బాబు, చినకాపవరం, ఆర్.వెంకన్నబాబు, అనాకోడేరు, పి.కోటేశ్వరరావు, గూట్లపాడు, పి.శ్రీనివాస్, తోలేరు, ఎ.జ్యోతి, దొడ్డనపూడి, జె.సునీత, ఎల్‌పి పీఎస్ఎం హైస్కూల్, భీమవరం.

పి.గురుమూర్తి, పీజీటీ, జెడ్పీహెచ్ఎస్, రాయకుదురు, బి.శ్రీనివాస్, సీఆర్ఎంటీ, జెడ్పీహెచ్ఎస్, తూర్పుతాళ్ళు, బి.రామకృష్ణ, సీఆర్ఎంటీ, జెడ్పీహెచ్ఎస్, లంకలకోడేరు, షేక్ బాల ఈశ్వరయ్య ఐఈఆర్‌పి, తాడేపల్లిగూడెం, బి.రవిప్రసాద్, పీటీఐ, జెడ్పీహెచ్ఎస్, రాయకుదురు, టీవీ.భద్రచార్యులు, పీటీఐ (ఆర్ట్), జెడ్పీహెచ్ఎస్, ఐభీమవరం, వై.శ్రావణి, పీటీఐ (డబ్ల్యుఈ), జెడ్పీహెచ్ఎస్, మట్లపాలెం,

సెకండరీ గ్రేడ్ టీచర్స్

రామాయణం శ్రీనివాస్, కొమరవరం, తణుకు, కె.సుధారాణి, కె.ఇల్లిందరపర్రు, ఎంవీవీఎస్ఆర్ రాజరాజేశ్వరరావు, తిరుపతిపురం, జి.సుధాకర్, మంచిలి, సీహెచ్‌వీ. సత్యనారాయణ, వెలగలవారిపాలెం, కె.సాయి రెడ్డి, మల్లిపూడి, సీహెచ్ఎస్‌వీఎస్ హరిరాజా, పెనుమంట్ర, జి.బేబీ ప్రశాంతి, మెంది, డీవీ.సత్యనారాయణ, బొండాడ చినపేట, కె.నిర్మల, వనంపల్లి, టి.విక్టరుబాబు, రేలంగి, ఆర్.కృష్ణమోహన్, దువ్వ, ఎం రామచంద్రరావు, ఉనికిలి, పి.కోటేశ్వరరావు, కత్తవపాడు, పి.ధనలక్ష్మి, ఆచంట, కె.రవి కుమార్‌వర్మ, ఉప్పరగూడెం, ఎ.ఏసెపు, పాతపూసలమర్రు, పి.కనకమహాలక్ష్మి, అలంపురం, పి.వాణి పుణ్యవతి, వడలి, బీవీఎల్ ప్రసన్నదుర్గ, సిద్ధాపురం, పి.కిశోర్, ఎస్‌జేఎస్‌జెడ్, ఆకివీడు, ఎం.సుధీర్‌బాబు, గోటేరు, కె.శ్రీదేవి, వంజావేమవరం.



దుస్తులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బడేటి చంటి, మంత్రి పార్థసారథి



పెనుగొండ వాసవీ క్షేత్రంలో సిద్ధం చేస్తున్న పులిహోర ప్యాకెట్లు



తెల్లవారుజామున దగ్గరుండి ఆహారం సిద్ధం చేయిస్తున్న చింతమనేని

బాధితులకు అండగా

విజయవాడ వరద బాధితులకు సహాయం చేసేందుకు రాజకీయ నాయకులు, వ్యాపారులు, అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు ఇలా ప్రతీ ఒక్కరూ మేమున్నామంటూ ముందుకు వస్తున్నారు. ఆహారం, వాటర్ ప్యాకెట్లతో పాటు నిత్యావసర వస్తువులు, దుప్పట్లు అందిస్తున్నారు.

భీమవరం టౌన్, సెప్టెంబరు 4: జిల్లా నుంచి జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి పర్యవేక్షణలో బుధవారం పెద్ద ఎత్తున వేలాది ఆహార పదార్థాలు, వాటర్ బాటిల్స్ విజయవాడకు పంపించారు. జనసేన పార్టీ జిల్లా మాజీ అధ్యక్షుడు డాక్టర్ యిర్రింకి సూర్యారావు ఆధ్వర్యంలో విజయవాడ వరద బాధితులకు ఐదు వేల బిర్యాని ప్యాకెట్లు,ఐదు వేల దుప్పట్లు అందించారు. ఎమ్మెల్యే రామాంజనేయులు వాహనానికి జెండా ఊపి ప్రారంభించారు. భీమవరం ఆక్వా డీలర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 2వేల ఆహార పదార్థాలను కలెక్టర్ , ఎమ్మెల్యే జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి ప్రారం భించారు. వీరవాసరం మండలం నవుడూరు గ్రామానికి చెందిన అడబాల నారాయణరావు 5 వేల మందికి భోజనం, వాటర్ ప్యాకెట్లు తరలించారు. జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మూడు రోజులు నుంచి సుమారు 5 వేల భోజనం ప్యాకెట్లు పంపారు. భీమవరం లయన్స్‌క్లబ్ తర పున 3 వేల మందికి భోజనం ప్యాకెట్స్‌ను పంపించారు. సీహెచ్ కృష్ణంరాజు అందించిన రూ.2 లక్షలతో వీటిని తయారు చేశారు.భీమవరం డీఎన్ఆర్ కాలేజ్ విద్యాసంస్థలు డిగ్రీ, పాలిటెక్నిక్, బీటెక్ విద్యార్థులు ఐదు వేల ఆహార పొట్లాలు తయారు చేయించి పంపారు.

ఆకివీడు : ఎమ్మెల్యే కనుమూరి రఘురామ కృష్ణరాజు ఆర్థిక సహకారంతో బుధవారం 12 వేల ఆహార పొట్లాలు, వెయ్యి వాటర్ బాటిల్స్ మూడు వాహనాలలో పంపించారు. ఆదర్శ లయన్స్ క్లబ్, ఆర్యవైశ్యుల ఆధ్వర్యంలో ఆహార పొట్లాలు పంపించారు.

కాళ్ళ: దొడ్డనపూడి సర్పంచ్ కొల్లి సుబ్బారావు, బీజేపీ ఉండి ఇన్‌చార్జి కోరా రామ్మూర్తి, సీసలి మాజీ సర్పంచ్ కట్రెడ్డి శ్రీనివాసరావు, సీసలి జన సేన గ్రామాధ్యక్షుడు నూకల భోగేంద్రబాబు సహకారంతో ఏర్పాటు చేసిన సుమారు 5 వేలు ఆహార పొట్లాలు, ఐదువేల వాటర్ బాటిల్స్‌ను బుధ వారం ప్రత్యేక వ్యాన్‌లో విజయవాడకు పంపించారు.

ఉండి : పెదపుల్లేరు గ్రామస్థుల ఆధ్వర్యంలో 6 వేల ఆహార పొట్లాలను పంపించారు. స్థానికులు పలువురు తరలివెళ్లారు. తహసీల్దారు నాగార్జున జెండాను ఊపి పంపించారు.

పాలకొల్లు రూరల్ : పాలకొల్లు జైభారత్ క్షీరా రామ ఆక్వా రైతు సంఘం తరపున 2 వేలు, కాస్మో కల్చరల్ స్పోర్ట్స్ క్లబ్ తరపున 3 వేల ఆహార పొట్లాలను, సంధ్యా మెరైన్స్ నుంచి 5 వేల ఆహార పొట్లాలు, విజయవాడకు వ్యాన్లలో పంపించారు.

నరసాపురం టౌన్ : కష్టకాలంలో ఉన్న వరద బాధితులకు ప్రతి ఒక్కరూ అండగా నిలవాలని ఎమ్మెల్యే నాయకర్ పిలుపునిచ్చారు. బుధ వారం రాత్రి వరద బాధితుల కోసం 20 లక్షలు విలువ చేసే 12 వేలు నిత్యావసర ప్యాకెట్లను సిద్ధం చేసి వాటిని వాహనంలో విజయవాడ తరలించారు. ఒక్కొక్క ప్యాకెట్‌లో ఐదు కేజీల బియ్యం, ఒక పాలు, బెడ్, ఇతర నిత్యవసరా వస్తువులు ఉన్నాయి. మండలంలోని కొప్పర్రు గ్రామానికి చెందిన జనసేన నాయకులు పోలిశెట్టి శ్రీనివాస్ విజయవాడ వరద బాధితులకు తనవంతు సాయంగా 1000 భోజన ప్యాకెట్లను పంపిణీ చేశారు. డీఆర్‌డీఏ సహకారంతో వీటిని వ్యాన్ సాయంతో తరలించారు.

పెనుగొండ : పెనుగొండ శ్రీవాసవీ టెంపుల్ ట్రస్టు ఆధ్వర్యంలో 2500 పులిహోర ప్యాకెట్లును , 2500 వాటర్ ప్యాకెట్లును పంపిణీ చేసినట్లు ట్రస్టు అధ్యక్షుడు డాక్టర్ గోవిందరాజులు తెలిపారు.

ఏలూరు టూటౌన్ : ఏలూరు అన్ ఎయిడెడ్ పాఠశాలల అసోసి యేషన్ ఆధ్వర్యంలో రూ.లక్షా 50 వేల విలువైన ఆహార పదార్థాలను విజయవాడ తరలించినట్టు అసోసియేషన్ జనరల్ సెక్రటరీ శర్మ తెలిపారు. నగర పాలక సిబ్బంది, డ్వాక్రా మహిళలు ఆహార పదార్థాలు తయారు చేస్తున్నారని ఎస్ఎంఎస్ అంబు లెన్స్ సర్వీస్ ద్వారా 5వేల మందికి ఆహార పొట్లాలు పంపినట్టు నగర మేయర్ షేక్ నూర్జహాన్ పెదబాబు అన్నారు. ఏపీఎన్ జీఎస్ అసోసియేషన్ అధ్యక్షుడు చోడగిరి శ్రీనివాసరావు, నెరుసు రామారావు 5వేల మందికి సరిపడ బ్రెడ్, వాటర్‌బాటిల్స్ పంపామన్నారు. శ్రీసత్యసాయి సేవా కేంద్రం ఆధ్వర్యంలో 5 వేల వాటర్ బాటిల్స్‌ను, బ్రెడ్ పంపించారు.

ఏలూరు కార్పొరేషన్ : ఏలూరు ఆర్డీవో ఎస్.కె.ఖాజావలి, తహశీల్దార్ జి.వి.శేషగిరిరావు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శ్రీనునాయక్, వీఆర్వోల బృందం లారీపై ఆహార పదార్థాలు, మంచినీటి బాటిల్స్, పాలు ప్యాకెట్లు, బిస్కెట్ ప్యాకెట్లతో తరలివెళ్లారు.

ఏలూరు రూరల్ : ఏపీఎన్జీవోస్ అసోసియేషన్ వారికి ఇచ్చిన విరాళాల సహాయనిధి నుంచి ఫుడ్ ప్యాకెట్లు, వాటర్‌ప్యాకెట్ల వాహనాన్ని ఏపీఎన్జీవోస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు చోడగిరి శ్రీనివాసరావు, ఏలూరు మున్సిపల్ కమిషనర్ ఏ.భానుప్రతాప్ ప్రారంభించారు.

ద్వారకాతిరుమల :ద్వారకాతిరుమలలో టీడీపీ నాయకుడు ఇమ్మడి రత్నాజీ ఆధ్వర్యంలో 4 వేల ఆహార పొట్లాలను, పంపించారు. గుడి సెంట ర్‌లో ఉన్న వ్యాపారులు 40 వేల వాటర్ ప్యాకెట్లను పంపారు. శ్రీవారి దేవ స్థానం 5,500 సాంబార్ రైస్‌ప్యాకెట్లు, 6 వేల వాటర్‌ప్యాకెట్లు పంపించారు.

చింతలపూడి : చింతలపూడి మండలం రాఘవాపురం గ్రామానికి చెందిన స్ఫూర్తి స్వచ్ఛంద సంస్థ కార్యదర్శి మొహిద్దీన్ పాషా వెయ్యి ఆహార పొట్లాలను తహసీల్దార్ ప్రమద్వర ఆధ్వర్యంలో పంపారు.

ఉంగుటూరు : కైకరం నుంచి జనసేన తరపున రూ.3.30 లక్షలతో తయారు చేసిన ఆహార పొట్లాలను పంపించారు. రెండు టన్నుల బియ్యం, 2 టన్నుల కూరగాయలు, టన్ను ఉప్మా రవ్వ, టన్ను చపాతి పిండి, టన్ను బత్తాయిలు, పంపారు.

దాతలు ముందుకు రావాలి

ఏలూరు టూటౌన్, సెప్టెంబరు4: వరద బాధితులను ఆదుకోవడానికి దాతలు ముందుకు రావాలని ఏలూరు ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య (చంటి), రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారధిలు అన్నారు. ఏలూరులో దాతల నుంచి సేకరించిన దుప్పట్లు, టవల్సును విజయవాడకు తీసుకెళ్ళి 15వ డివిజన్ పోలీస్‌కాలనీలో పంపిణీ చేశారు. ఎవరు అధైర్యపడవద్దని, కూటమి ప్రభుత్వం బాధితులను ఆదుకుంటుందని భరోసా ఇచ్చారు.

బాధితులకు ఆహారం పంపిణీ



ఆహారం అందిస్తున్న ఆరిమిల్లి

తణుకు, సెప్టెంబరు 4: విజయ వాడలోని వరద బాధితులకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధా కృష్ణ 5 వేల టమాటా రైసు ప్యాకె ట్లును బుధవారం పంపిణీ చేశారు. వీటితో పాటు పాలు. బ్రెడ్‌లు, వాటర్ బాటి ళ్ళను పంపిణీ చేశారు. తణుకు నుంచి టీడీపీ నాయకులు తాత పూడి మారుతీరావు, ఒమ్మి రాంబాబు, మేడికొండ రామకృష్ణ శివరావు వెళ్ళారు. కటకం రామకృష్ణ ఆధ్వర్యంలో పులిహోర, వాటర్ బాటిల్స్ కూరగాయలు, బిస్కెట్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు.

ఏ సాయానికైనా సిద్ధం : ఎమ్మెల్యే బొలిశెట్టి



తాడేపల్లిగూడెం అర్బన్: వరద బాధితుల కోసం ఏ సాయం చేయడాని కైనా తాము సిద్ధంగా ఉంటామని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ ముఖ్యమంత్రి చంద్ర బాబుతో అన్నారు. విజయవాడ కలెక్టరేట్‌లో జరిగిన సమీక్షలో పాల్గొన్నారు. తాడేపల్లిగూడెం నుంచి ఇప్పటికే సుమారు లక్ష ఆహార ప్యాకెట్లు, వివిధ స్వచ్ఛంద సంస్థల నుంచి వాటర్‌బాటిల్స్, బిస్కెట్ ప్యాకెట్స్, బ్రెడ్స్ సిద్ధం చేస్తున్నామన్నారు.

దుప్పట్లు పంపిణీ



నిడమర్రు : పత్తేపురం గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు పొత్తూరి నరసింహరాజు తన అనుయాయులతో కలసి విజయవాడ 54, 55, 56 డివిజన్లు, సింగ్‌నగర్‌లలో బాధితులకు వాటర్ బాటిల్స్ ఆహార పొట్లాలు, పంపిణీ చేశారు. బుధ వారం దుప్పట్లు, పంచెలు, చీరలు పంపిణీ చేశారు. ఛానమిల్లి, అడవి కొలను గ్రామాల నుంచి టీడీపీ ఆధ్వర్యంలో సుమారు 5 వేల ఆహార పొట్లాలు పంపారు.

విజయవాడకు పారిశుధ్య కార్మికులు

ఏలూరు టూటౌన్ : విజయవాడ వరద ప్రభావిత ప్రాంతాలకు పారిశుధ్య కార్మికులను 130 మందిని పంపిస్తున్నట్లు కమిషనర్ ఏ.భానుప్రతాప్ తెలిపారు. ఇంతకు ముందు 150 మంది వర్కర్లను 20 మంది సచివాలయ సెక్రటరీల ను పంపించినట్లు ఎంహెచ్‌వో డాక్టర్ మాలతి తెలిపారు.



ఎమ్మెల్యేలకు విరాళం అందిస్తున్న దాతలు

దాతల విరాళాలు

నరసాపురం : వరద బాధితుల సహాయార్థం నరసాపురం ఐఎంఐ, ఇండియన్ డెంటల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రూ.లక్ష చెక్కు. సంఘం నాయకులు డాక్టర్ కోటేశ్వరరావు, నర్సింహరావు, మూర్తిలు బుధవారం ఎమ్మెల్యే నాయకర్‌కు అందించారు.



భీమవరం టౌన్ : కృష్ణ బలిజ టీడీపీ బీసీ రాష్ట్ర సాధికారిత కమిటీ సభ్యులు గంటా త్రిమూర్తులు ఆధ్వ ర్యంలో రూ.75 వేలు ఎమ్మెల్యే అంజిబాబుకు అంది ంచారు. జిల్లా ముఖ్య ప్రణాళిక కార్యా లయం అధికారులు, సిబ్బంది జిల్లా కలెక్టర్‌ను కలిసి వరద బాధితుల సహాయార్థం రూ.1.21 లక్షలు చెక్కును సీపీవో ఎం.మోహన్ రావు చేతుల మీదుగా అందజేశారు. ఉండి మండలం కలిగొట్ల గ్రామం నివాసి హైదరాబాదు ఐఐసీటీలో పనిచేస్తూ రిటైర్డు అయిన విశ్రాంత ఉద్యోగి సాగి రాజు వెంకట సత్యనారాయణ రాజు దాచుకున్న సేవింగ్స్ నుంచి రూ.50 వేల చెక్కును జిల్లా కలెక్టర్ చాంబర్‌లో అందజేశారు. పట్టణానికి చెందిన న్యాయవాది తాడిమళ్ళ గిరి రూ.50 వేల విరాళం చెక్కు అందజేశారు.



నరసాపురంలో బియ్యం ప్యాక్ చేస్తున్న జన సేవకులు

భీమడోలు :పూళ్ళ ఎంఎంపురం గ్రామాల్లోని ఆర్యవైశ్య సంఘం ఆధ్వ ర్యంలో ఐదు వేల బిర్యానీ ప్యాకెట్లు, 10 వేల వాటర్ ప్యాకెట్ల తరలించారు.

కామవరపుకోట : ఏలూరు ఎంపీ పుట్టా మహేష్‌కుమార్, చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్‌ల సూచనతో కామవరపుకోట నియోజక వర్గానికి చెందిన కూటమి నాయకుల బృందం బుధవారం వివిధ వాహ నాల్లో బిస్కెట్ ప్యాకెట్లు, మంచినీరు, ఆహార పదార్థాలను తీసుకువెళ్ళారు.

పెదవేగి : వరదలకు అల్లాడుతున్న ప్రజల అవసరాలను తీర్చడమే మనందరి ప్రథమ కర్తవ్యం కావాలని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. దెందులూరు నియోజకవర్గం నుంచి 50 వేల మందికి ఆహారాన్ని సిద్ధం చేసి విజయవాడ తీసుకెళ్ళి బాధితులకు అందించారు. ఏడు పదుల వయస్సులో చంద్రబాబునాయుడు యువకుడిలా పనిచేస్తుంటే ఒక్క పులిహోర పొట్లం కూడా పంచడం చేతకాని జగన్ కూటమి ప్రభుత్వం చేస్తున్న సేవలపై వ్యాఖ్యలు చేయడం సిగ్గు చేటన్నారు.నీచరాజకీయాలు చేయడం ఒక్క జగన్‌కే చెల్లుతుందని విమర్శించారు. ఇకపై ఆహారం కాకుండా ఆహార వస్తువులను అందించే దిశగా స్పందించాలని ఆయన పిలుపునిచ్చారు. పార్టీ నాయకులు బొప్పన సుధాకర్, తాతా సత్యనారాయణ, మాగంటి నారాయణ ప్రసాద్, జాస్తి ప్రసాద్, లావేటి శ్రీనివాసరావు, నంబూరి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



ద్వారకాతిరుమల నుంచి జెండా ఊపి వ్యాన్ పంపిస్తున్న ఎస్సై సుధీర్



పాలకొల్లు కాస్మో కల్చరల్ స్పోర్ట్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆహారం తరలింపు



ఆహార పదార్థాలను పంపుతున్న జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్



ఆకివీడు నుంచి ఆహార పొట్లాలతో వెళుతున్న వాహనం

306 మంది సర్‌ప్లస్ టీచర్లకు 'సర్దుబాట్లు' నుంచి ఉపశమనం

రేపు నూతన స్థానాల్లో విధుల్లో చేరేందుకు నియామకపత్రాల జారీ

జిల్లాలో ముగిసిన వర్క్ అడ్జస్ట్‌మెంట్ కౌన్సెలింగ్

ఏలూరు అర్బన్, సెప్టెంబరు 4 : సుదీర్ఘంగా సాగిన సర్‌ప్లస్ టీచర్ల వర్క్ అడ్జస్ట్‌మెంట్ కౌన్సెలింగ్ బుధవారంతో ముగిసింది. తుదివిడతగా జిల్లాలోని 28 మండలాల్లో సర్‌ప్లస్ ఎస్జీటీలుగా వున్న 200 మందిని అదే మండలపరిధిలో కొరతవున్న పాఠశాలలకు సర్దుబాటు చేసేందుకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఇందులో 160 మంది ఎస్జీటీలు అదే కేడర్‌లోని వెకెన్సీలను కోరుకోగా, ఇంకా మిగిలిపోయిన 40 మందిని ప్రస్తుత స్థానాలకే వెనక్కి పంపివేశారు. ఆ ప్రకారం ఏలూరు జిల్లాలో మొత్తం 805 మంది ఉపాధ్యాయులను సర్‌ప్లస్ టీచర్లుగా గుర్తించిన విషయం విదితమే. జిల్లాలో మొత్తం 499 స్కూల్ అసిస్టెంట్, ఎస్జీటీ వేకెన్సీలను ఆయా మండలాల్లోని పాఠశాలల్లో గుర్తించి సర్దుబాట్లు చేపట్టగా, హిందీ, బయోలాజికల్ సైన్స్, ఇంగ్లీషు సబ్జెక్టుల్లో తగినంతమంది అర్హులు లేక 420 వేకెన్సీలను మాత్రమే ఆయా కేడర్లలో భర్తీ చేయగలిగారు. తొలుత స్కూల్ అసిస్టెంట్లకు మండల, డివిజన్ స్థాయిల్లో కౌన్సెలింగ్ నిర్వహించి సర్దుబాట్లు చేశారు. అనంతరం బుధవారం ఒక్కరోజులోనే సర్‌ప్లస్ ఎస్జీటీలందరినీ మండల స్థాయిలో అడ్జస్ట్ చేశారు. కౌన్సెలింగ్ అనంతరం జిల్లాలో మొత్తంమీద వర్క్ అడ్జస్ట్‌మెంట్‌కు 805 మంది సర్‌ప్లస్ టీచర్లను గుర్తించినప్పటికీ వివిధ కారణాల వల్ల సుమారు 306 మందిని ప్రస్తుత స్థానాలకే తిరిగి వెనక్కి పంపించి వేయడంతో సంబంధిత ఉపాధ్యాయులందరికీ ప్రయోజనం లభించినట్టయింది. మండల, డివిజన్‌స్థాయి కౌన్సెలింగ్‌లలో నూతన స్థానాలను కోరుకున్న స్కూల్ అసిస్టెంట్లు, ఎస్జీటీలందరూ సంబంధిత స్కూళ్ళలో శుక్రవారం సాయంత్రంలోగా విధుల్లో చేరేందుకు వీలుగా నియామక పత్రాలు కూడా జారీ చేశారు.

ఉండి కేవీకేలో సేంద్రియ వ్యవసాయంపై ఆన్‌లైన్ సర్టిఫికెట్ కోర్సులు

ఉండి సెప్టెంబరు 4 :ఉండి కృషి విజ్ఞానకేంద్రంలో సేంద్రియ వ్యవసాయంపై ఆన్‌లైన్ ద్వారా నెలరోజులపాటు సర్టిఫికెట్ కోర్సులు ప్రారంభించడం జరుగు తుందని ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ మల్లికార్జునరావు తెలిపారు. ఈ కోర్సు వ్యవధి నాలుగు వారాలు వుంటుందన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు రూ.1500 ఫీజు చెల్లించి కోర్సుకు పేరును నమోదు చేయించుకోవాలన్నారు. నమోదు చేయించుకున్న అభ్యర్థులకు ఆన్‌లైన్ సదుపాయం కంప్యూటర్, సెల్ ఫోన్ కలిగి వుండాలన్నారు. ఈ సర్టిఫికెట్ కోర్సులు చేయాలనుకునే వారు సెప్టెంబరు 20వ తేదీలోపు పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు. ఈకోర్సుకు సంబంధించి పూర్తి వివరాలు వ్యవసాయ విశ్వవిద్యాలయం వెబ్‌సైట్ సందర్శించి తెలు సుకోవచ్చుని తెలిపారు. .80087 88776, 83096 26619, 80960 85560. నంబ ర్లలో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 7 గంటల వరకు వివరాలు తెలుసు కోవచ్చని మల్లికార్జునరావు తెలిపారు.

అవినీతి నిగ్గు తేలాల్సిందే..

గరగపర్రు పంచాయతీలో ప్రైవేటు వ్యక్తి వ్యవహారం

కార్యదర్శుల తీరుపై గ్రామస్థుల మండిపాటు



పాలకోడేరు, సెప్టెంబరు 4: గరగపర్రు గ్రామ కార్యదర్శుల నిర్వాకంతో ఆ గ్రామం ఒక్కసారిగా ఉలిక్కిపడింది. గరగపర్రు గ్రామ పంచాయతీలో ఎటువంటి సంబంధంలేని ప్రైవేటు వ్యక్తి పంచాయతీకి వచ్చి గ్రామ కార్యదర్శులు లేకుండానే పంచాయతీ రికార్డులను సరిచేయడం పట్ల పంచాయతీ బోర్డు సభ్యులు, గ్రామస్థులు ఆ వ్యక్తిని నిర్బంధించి పోలీసులకు మంగళవారం ఫిర్యాదు చేశారు. ఈ సంఘటనతో పంచాయతీ అవినీతిపై గ్రామంలో చర్చనీయాంశమైంది. అసలు విషయానికి వస్తే గత వైసీపీ పాలనలో గ్రామ పంచాయతీ కార్యదర్శిగా రాజేష్ అనే వ్యక్తి విధులు నిర్వహిస్తూ వచ్చాడు. అతని హయాంలో అదే గ్రామానికి చెందిన ఒక మహిళ చేత ఇంటి పన్నులు వసూలు చేయిస్తూ వస్తున్నాడు. అయితే ఆరునెలల క్రితం రాజేష్ బదిలీపై పాలకొల్లు మండలానికి వెళ్ళిపోయాడు. ఆయన స్థానంలో పెన్నాడ పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్న లక్ష్మీ గరగపర్రు ఇన్‌ఛార్జ్ కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ వరకు బాగానే ఉన్నా మార్చి నెలలో బదిలీపై వెళ్ళిన రాజేష్ ఇన్‌ఛార్జ్ కార్యదర్శిగా బాధ్యతలు తీసుకున్న లక్ష్మికి ఎటువంటి చార్జ్ అప్పగించకుండా బదిలీపై వెళ్ళిపోయాడు. ఇన్‌ఛార్జ్ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న లక్ష్మి బాధ్యతలు చేస్తూ వస్తున్నారు. ఆగస్టు నెలలో లక్ష్మి స్థానంలో నూతనంగా గరగపర్రు పంచాయతీ లక్ష్మీప్రశాంతి అనే ఆమె కార్యదర్శిగా బాధ్యతలు తీసుకున్నారు. దీంతోనే ఆ పంచాయతీలో ఉన్న కార్యదర్శుల వ్యవహారం బయటకొచ్చింది. నూతనంగా బాధ్యతలు తీసుకున్న లక్ష్మీప్రశాంతికి చార్జ్ అప్పగించాలంటే గత వైసీపీ హయాంలో పనిచేసిన కార్యదర్శి రాజేష్ చార్జ్‌ను అప్పగించి తీరాల్సి ఉంది. ఈ నేపథ్యంలోనే రాజేష్ ఓ ప్రైవేటు వ్యక్తిని మంగళవారం గరగపర్రు పంచాయతీలో రికార్డులు సరి చేయమని పంపడంతో ఈ వ్యవహారమంతా బయటకు వచ్చింది. పంచాయతీలో కార్యదర్శుల వ్యవహారంలో అవినీతిని ఉన్నతాధికారులు క్షుణ్ణంగా పరిశీలించి నిగ్గు తేల్చా లని పంచాయతీ బోర్డు సభ్యులు, గ్రామస్థులు కోరుతున్నారు. మంగళవారం బయటపడిన ప్రైవేటు వ్యక్తి ఉదంతంపై గత పంచాయతీ కార్యదర్శి చేసిన వ్యవహారంలో చాలా అవినీతి జరిగిందంటూ గ్రామస్థులు బాహాటంగా ఆరోపిస్తున్నారు. ఈ వ్యవహారాన్ని పూర్తి స్థాయిలో విచారించి అవినీతికి పాల్పడిన కార్యదర్శులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. పంచాయతీ నుంచి బయటకు వెళ్ళి ఆరు, ఏడు నెలలు అవుతున్నా ఛార్జ్ అప్పగించకపోవడం, ఇన్‌ఛార్జ్‌గా బాధ్యతలు తీసుకున్న లక్ష్మి కూడా ఇంత కాలం ఆగటం ఏమిటని గ్రామస్థులు ప్రశ్నిస్తున్నారు.

క్రైం కార్నర్..

భవనం పైనుంచి పడి కార్మికుడు మృతి



ఏలూరు క్రైం, సెప్టెంబరు 4 : తాపీపనికి వెళ్ళిన ఒక కార్మికుడు ప్రమాద వశాత్తు భవనం నుంచిపై పడి మృతి చెందాడు. మృతుడు విజయవాడలోని కృష్ణలంక లేదా గుంటూరులోని కొరటిపాడు ప్రాంతానికి చెందినవాడుగా ప్రాథమికంగా తెలుస్తోంది. ఏలూరు చిరంజీవి బస్టాండ్ ప్రాంతంలో కొన్నేళ్ళుగా ఒంటరిగా నివాసం ఉంటూ తాపీ పనులకు వెళ్తున్నాడు. ఈ నెల 2వ తేదీన రామకృష్ణాపురంలోని ఒక బిల్డింగ్ సెంట్రింగ్ పనులు చేయడానికి వెళ్ళాడు. ప్రమాదవశాత్తు బిల్డింగ్‌పై నుంచి కిందపడి తీవ్ర గాయాలకు గురవ్వగా ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తోటి కార్మికులు తీసుకువెళ్ళగా అప్ప టికే వైద్యులు మృతి చెందారని తెలిపారు. అతని పేరు గోపు వెంకటేశ్వర రావు (60)గా మాత్రమే అందరికి తెలుసు. అతని బంధువులు, స్నేహితులు కూడా ఎవరూ తెలియదు. విజయవాడ కృష్ణలంక, కొరటి పాడులో తన బంధువులు ఉన్నారని చెప్తుండేవారని అన్నారు. మృతుని చిరు నామా తెలిసిన వారు ఏలూరు త్రిటౌన్ పోలీస్ స్టేషన్ ఫోన్ నెంబర్ 91548 45553 లేదా 91478 75554 లేదా 915487 5758లకు సమాచారం ఇవ్వాలని ఏలూరు సీఐ ఎస్ కోటేశ్వరరావు కోరారు.

గుళికలు సేవించి ఒకని మృతి

చింతలపూడి, సెప్టెంబరు 4: చింతలపూడి మండలం తమ్మిలేరు రిజ ర్వాయర్ సమీపంలో గుళికలు తాగి ఒక వ్యక్తి మృతిచెందినట్టు పోలీసులు తెలిపారు. మతుఉడు నగరపంచాయతీ పాత చింతలపూడికి చెందిన ముళ్ళగిరి రవి కుమార్ (33)గా గుర్తించారు. కుటుంబ సభ్యులను పిలిపించి విచారించారు. ఎస్సై కుటుంబరావు తెలిపిన వివరాల ప్రకారం కుటుంబ కలహాల కారణంగా గుళికలు సేవించాడని అతనికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

విద్యుత్ షాక్‌తో జట్టు కూలీ మృతి



కొయ్యలగూడెం, సెప్టెంబరు 4: విద్యుత్ షాక్‌కు గురై ఒక జట్టుకూలి మృతి చెందాడు. ఈ సంఘటన బుధవారం ఉదయం స్థానిక సంత మార్కెట్‌లో జరిగింది. ఈ ప్రమాదంలో నిడద వోలు మండలం లింగపల్లి గ్రామానికి చెందిన భీమడోలు శ్రీనివాస్ (42) మృతి చెందినట్టు ఎస్సై చంద్రశేఖర్ తెలిపారు. శ్రీనివాస్ సంత మార్కెట్‌లో వాహనం నుంచి టమోట లోడ్ దించుతుండగా పైనున్న విద్యుత్‌వైర్లు తగిలాయి. దీంతో షాక్ కొట్టి రోడ్డుపై పడి మృతి చెందాడు. మృతునికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

సెల్‌ఫోన్ టవర్ల వద్ద బ్యాటరీల చోరీ

లింగపాలెం, సెప్టెంబరు 4: సెల్‌ఫోన్ టవర్ల వద్ద బ్యాటరీలు దొంగతనం చేస్తున్న ఆరుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై వెంకన్న తెలిపారు. లింగపాలెం మండలం యడవల్లి గ్రామశివారులో ఉన్న సెల్‌ఫోన్ టవర్‌తో పాటు పలు గ్రామాల్లో సెల్‌ఫోన్ టవర్ల వద్ద ఉన్న బ్యాటరీలను దొంగతనం చేస్తున్నట్లు ఫిర్యాదు రావడంతో పోలీసులు గస్తీ నిర్వహించి ఆరుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. యడవల్లిలోనే కాకుండా చుట్టుపక్కల గ్రామాల్లో కూడా సెల్‌ఫోన్ టవర్ల వద్ద ఉన్న బ్యాటరీలను దొంగిలించి అమ్ముతున్నట్లు తెలిపారు. వారి వద్ద నుంచి 8 బ్యాటరీలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు ఎస్ఐ చేస్తున్నట్లు తెలిపారు.



పోస్టర్ ఆవిష్కరించిన కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ

13 నుంచి భీమవరంలో చెస్ టోర్నమెంట్

భీమవరంటౌన్, సెప్టెంబరు 4 : అనసూయ చెస్ అకాడమీ, జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 13,14,15 తేదీల్లో భీమవరం వన్‌టౌన్ లోని శ్రీకృష్ణదేవరాయ కళ్యాణ మండపంలో మూడు రోజులపాటు పోటీలు ఇంటర్నేషనల్ చెస్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నారు. బ్రోచర్‌ను కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ బుధవారం ఆవిష్కరించారు. జిల్లా చదరంగం అసోసియేషన్ అధ్యక్షుడు మాదాసు కిషోర్ మాట్లాడుతూ ఈ టోర్నమెంట్లో వివిధ దేశాలకు, వివిధ రాష్ట్రాలకు చెందిన 400 మంది క్రీడాకారులు పాల్గొంటున్నారని, ఐదు లక్షల రూపాయల నగదు బహుమతులు అంది స్తున్నామని తెలిపారు. తోట హరిబాబు, జిల్లా పార్లమెంట్ కన్వీనర్ పేరిచర్ల శ్రీనివాసరాజు, టౌన్ చెస్ అసోసియేషన్ అధ్యక్షుడు అల్లూరి శివరామరాజు, జిల్లా సంయుక్త కార్యదర్శి మైలాపురి మురళి,అల్లు శ్రీనివాసులు పాల్గొన్నారు.

అది మంకీ పాక్స్ కాదు : డీఎంహెచ్‌వో

భీమవరం టౌన్, సెప్టెంబరు 4 : అత్తిలిలో కాశీశ్రీను అనే గొర్రెల కాపరికి మంకీపాక్స్ లక్షణాలు ఉన్నట్లుగా అనుమానాలు వచ్చాయని అతనికి విజయవాడ ల్యాబ్‌లో పరీక్షలు చేస్తే నిర్ధారణ కాలేదని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి (డీఎంహెచ్‌వో) డాక్టర్ మహేశ్వరరావు తెలిపారు. శరీరంపై పొక్కులు స్కిన్ వ్యాధికి సంబంధించినవని తేలిందని బుధవారం ఆయనను ఫోన్‌లో సంప్రదించినపుడు వివరించారు.

యువకుడిపై పోక్సో కేసు నమోదు

మొగల్తూరు,సెప్టెంబరు 4: మైనర్ బాలికను కిడ్నాప్ చేసి అత్యాచారం చేసిన యువకుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ జి.వాసు తెలిపారు. ముత్యాలపల్లికి చెందిన 16 సంవత్సరాల బాలికను అదే గ్రామానికి చెందిన నర్సింహస్వామి కిడ్నాప్ చేసి అత్యాచారం చేశాడన్నారు. దీంతో బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు. నరసాపురం డీఎస్పీ మురళీకృష్ణ బుధవారం విచారణ చేశారు.

మహిళ మెడలోని బంగారు గొలుసు చోరీ

ఏలూరు క్రైం, సెప్టెంబర్ 4 : స్కూలు నుంచి తన కుమారుడిని ఇంటికి తీసుకువెళ్తున్న ఒక మహిళ మెడలోని బంగారు గొలుసును గుర్తు తెలియని ఇద్దరు యువకులు మోటారు సైకిల్‌పై వచ్చి తెంపుకు పోయారు. ఏలూరు వన్ టౌన్‌లోని పడమర వీధికి చెందిన దార లక్ష్మీ ప్రసన్న (38) తన కుమారుడిని స్కూలు నుంచి బుధవారం మధ్యాహ్నం భోజనానికి ఇంటికి తీసుకువెళ్లి ఇంటి వద్ద గేటు తీస్తున్న సమయంలో ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు ఆమె మెడలో ఉన్న నాలుగు కాసుల బంగారు మంగళసూత్రాల గొలుసును తెంపుకుని మోటారు సైకిల్‌పై పరారీ అయ్యారు. బాధితురాలు ఏలూరు వన్ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సీఐ సత్యనారాయణ ఆధ్వర్యంలో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కొట్లాట కేసు నమోదు

పెదపాడు, సెప్టెంబరు 4 : పొలం వద్ద ఇరువర్గాల మధ్య తగాదా.. పరస్పర ఫిర్యాదుల నేపథ్యంలో పెదపాడు పోలీసులు కేసు నమోదు చేశారు. పెదపాడు గ్రామానికి చెందిన విజ్జి శేఖర్, రామచంద్రపురానికి చెందిన రైతు రాజాలు పొలం వద్ద తగాదా పడగా ఇరువురికి దెబ్బలు తగిలినట్లుగా ఫిర్యాదు చేశారు. ఎస్సై కె.శుభశేఖర్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.



యలమంచిలి - చించినాడ రహదారి గుంతల్లో నిలిచిన నీరు





ఆచంటలో కురుస్తున్న వర్షం.. పెంటపాడు మండలం బి.కొండేపాడులో నీటమునిగిన పల్లపు రహదారి.. వడలిలో ఆహార పదార్థాలను పంపిణీ చేస్తున్న అక్షయ పాత్ర సభ్యులు

రహదారి అధ్వానం

యలమంచిలి, సెప్టెంబరు 4: వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు మేడపాడు, ఆర్యపేట, యలమంచిలి, చించినాడ, ఏనుగువానిలంక, నవరసపురం గ్రామాల మధ్య ఉన్న ప్రధానరహదారి మరింత ఛిద్రమైంది. యలమంచిలి నుంచి బ్రాంచి కాలువ మధ్యలో సుమారు మూడు ప్రాంతాల్లో రహదారి పెద్దఎత్తున గోతులుపడి, పలుచోట్ల కుంగిపోయి ప్రమాదకరంగా ఉంది. గోతుల్లో వర్షపునీరు నిలిచిపోయి.. దారి ఎగుడు దిగుడుగా ఉండడంతో ఈ ప్రాంతాల్లో ప్రయాణించే ఆటోలు, స్కూల్ బస్సులు, లారీల డ్రైవర్లు మరింత అప్రమత్తంగా నడపకపోతే వాహనాలు తిరగబడి పోయే పరిస్థితి నెలకొందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ రహదారిలో ఏనుగువానిలంక గ్రామ శివారులోనూ, ఆర్యపేట ఘటాలచెరువు సమీపంలోనూ ఇదే పరిస్థితి ఉందని వాహనదారులు వాపోతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి ఈ ప్రాంతాల్లో తక్షణమే రహదారిని చదునుగా చేస్తే తాత్కాలికంగా ఉపశమనం లభిస్తుందని వాహనదారులు, స్థానికులు కోరుతున్నారు.

ఇంజన్లతో పొలాల్లో నీరు బయటకు..

ఆకివీడురూరల్, సెప్టెంబరు 4 : ముంపు బారి నుంచి వరి పొలాలను రక్షించుకునేందుకు ఇంజన్లే శరణ్యమని రైతులు తెలియజేస్తున్నారు. వర్షపు నీటితో పొలాలు నిండిపోయాయని, ఈ నీటిని ఇంజన్ల ద్వారా బయటకు తోడితే పొలాలను రక్షించుకోవచ్చని లేదంటే కుళ్లిపోయతాయని యుద్ధప్రాతిపదికన ఇంజన్లు ఏర్పాటు చేసుకుంటున్నారు. ఆయిల్ ఇంజన్లకు ప్రభుత్వం ఆయిల్ అందించాలని కోరుతున్నారు. బుధవారం భారీ వర్షం కురవడంతో రైతులు మరింత ఆందోళన చెందుతున్నారు.



గుమ్ములూరులో ఇంజన్లతో పొలంలో నీటిని బయటకు తోడుతున్న దృశ్యం



మొగల్తూరు ఉన్నత పాఠశాలలో నీటిని బయటకు తోడుతున్న ఇంజన్లు

మళ్లీ జోరు వాన

- పల్లపు ప్రాంతాలు జలమయం
- స్తంభించిన జనజీవనం
- నీట మునిగిన రహదారులు

ఆచంట/పెనుగొండ, సెప్టెంబరు 4 :ఏకధాటిగా బుధవారం వేకువజామున ఉదయం మూడు గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జోరు వాన కురిసింది. ఆచంట, పెనుగొండ మండలాల్లోని పలు రహదారులు, కాలనీలు, పల్లపు ప్రాంతాలు జలమయం అయ్యాయి. జనజీవనం స్తంభించింది. రానున్న రెండు మూడు రోజుల్లో మళ్లీ పెద్దఎత్తున భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ సూచనలతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. పెనుగొండ మండలం పెనుగొండలోని కోడి పందేల దిబ్బ ప్రాంతంలో రోడ్లన్నీ జలమయమయ్యాయి. సుమారు 300 కుటుంబాల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అధికారులు, పాలకులు పట్టించుకోకపోవడంతో రోడ్డుపై ఉన్న నీటిని కాలనీ వాసులే తోడుకుని పరిస్థితి ఏర్పడింది. గతంలో పంచాయతీ అధికారులు ట్యాంక్‌లతో నీరు సరఫరా చేసేవారని ఇప్పుడు పూర్తిగా నిలిపి వేశారని, సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళన చేస్తామని చెబుతున్నారు. వడలి గ్రామంలో పెనుగొండ ఆర్యవైశ్య సత్రం వద్ద జరిగిన ఆహార పంపిణీ కార్యక్రమంలో భాగంగా మిగిలిన పదార్థాలను అక్షయ పాత్ర సభ్యులు నిరుపేదలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉప్పలపాటి చంటి, మేకా సురేష్, పాల్గొన్నారు.

- ఉండి : ఎడతెరపి లేకుండా బుధవారం కురిసిన వర్షానికి డ్రెయిన్లు పొంగిపొర్లాయి. రహదారులు నీటమునిగాయి. 216 జాతీయ రహదారిపై వర్షపునీరు చేరుకోవడంతో వాహనదారులు అవస్థలుపడ్డారు.
- పెంటపాడు : పెంటపాడు మండలంలో బుధవారం తెల్లవారుజామున మూడు గంటలకు మొదలైన వాన మధ్యాహ్నం 12 గంటల వరకు కురుస్తూనే ఉంది. గ్రామాల్లో డ్రెయినేజీ వ్యవస్థ సరిగా లేక వర్షపు నీరు రహదారులపైనే నిలిచిపోయింది. పెంటపాడులో పాత పంచాయతీ రహదారి, కోనేరు చెరువు సమీపంలోని రహదారి, కాలేజ్ సెంటర్ రహదారులు మునిగిపోయాయి. బి.కొండేపాడులోనూ ఇదే పరిస్థితి నెలకొంది.
- మొగల్తూరు/పాలకొల్లు : మొగల్తూరు మండలంలో బుధవారం ఉదయం వరకు 19.4 మిల్లీ మీటర్ల వర్షం కురవడంతో చేలు ఏరులుగా మారాయి. కాళీపట్నం జాతీయ రహదారికి డ్రెయిన్ సదుపాయం లేకపోవడంతో ఆ రహదారి కాస్త పంట కాల్వను తలపించింది. కేపీ పాలెం, పేరుపాలెం, కాళీపట్నం ప్రధాన రహదారులపై నీరు నిలిచిపోవడంతో స్థానికులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మండలంలో సుమారు 450 ఎకరాల్లో వరి ఊడ్పులు చేయగా సుమారు 200 ఎకరాలు పూర్తిగా నీట మునగడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. చలి గాలులు, వర్షం ప్రభావంతో చేపలు, రొయ్యల చెరువులకు ఆక్సిజన్ అందక మత్స్యసంపద నశించిపోతుందని ఆక్వా రైతులు ఆందోళన చెందుతున్నారు. మొగల్తూరు ఉన్నత పాఠశాలలో వర్షం నీరు పంట కాలువను తలపిస్తుండటంతో పంచాయతీ సిబ్బంది ఆ నీటిని ఇంజన్ల సాయంతో బయటకు తోడుతున్నారు. పాలకొల్లు మండలంలోని పలు గ్రామాల్లో కురిసిన భారీ వర్షానికి పల్లపు ప్రాంతాలు జలమయం అయ్యాయి.

చెంచుల కాలనీ వాసులకు అండగా టీడీపీ, జనసేన

ఆకివీడు, సెప్టెంబరు 4 : చినకాపవరం మురుగుకాల్వ ఉప్పొంగి కట్టలు తెగే ప్రమాదం ఉన్నందున నివారణ చర్యలు చేపట్టారు. ఎమ్మెల్యే కనుమూరి రఘురామకృష్ణరాజు ఆదేశాల మేరకు టీడీపీ మండలాధ్యక్షుడు మోటుపల్లి రామవర ప్రసాద్ పర్యవేక్షణలో డ్రెయినేజీ అధికారులతో కలిసి బుధవారం ఇసుక, కంకర బస్తాలు ఏర్పాటు చేశారు. టీడీపీ సీనియర్ నేతలు గొట్టుముక్కల వెంకట సత్యనారాయణ రాజు, బొల్లా శేషుబాబు, జనసేన పట్టణ ఉపాధ్యక్షుడు కారంపూడి జానకీ సుమంత్ సౌజన్యంతో కాల్వ కట్టలు తెగకుండా ముందస్తు చర్యగా ఏర్పాట్లు చేశామన్నారు. మురుగుకాల్వ సమీపంలోని చెంచుల కాలనీ వాసులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో 17వ వార్డు టీడీపీ ఇన్‌చార్జి కోమటి గోపి తదితరులు ఉన్నారు.



చినకాపవరం మురుగు కాల్వకు బస్తాలతో అడ్డుకట్ట వేస్తున్న కూటమి నేతలు

వరద బాధితులకు విరాళాలివ్వండి : ఆరిమిల్లి



తణుకు, సెప్టెంబరు 4: విజయవాడలోని వరద బాధితులను ఆదుకునేం దుకు మానవతా దృక్పథంతో, దాతలు సహృదయంతో విరాళాలివ్వాలని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ కోరారు. విరాళాలు ఇవ్వాలనుకునే దాతలు చీఫ్ మినిస్టర్స్ రిలీఫ్ ఫండ్, ఆంధ్రప్రదేశ్ పేరుతో చెక్కు రూపంలో తణుకులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అందించాలని కోరారు.

సహాయ విషయాలను చంద్రబాబు దృష్టికి..

భీమవరంటౌన్, సెప్టెంబరు 4 :విజయవాడ 30వ డివిజన్ వరద బాధితుల సహాయార్థం డివిజన్‌లోని ఆహారం, మందులు మొదలగున్న వాటిని పరిశీలించి రాత్రి పది గంటల సమయంలో విజయవాడ జిల్లా కలెక్టర్ ఉన్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కలిసి అక్కడ సమస్యలను సమగ్రంగా వివరించిన డివిజన్ పరిశీలకుడు, రాష్ట్ర కార్యదర్శి కోళ్ళ నాగేశ్వరావు. ఆయనకు చంద్రబాబు పలు సూచనలు అందించారు. బాధితులకు అన్ని సక్రమంగా అందుతున్నాయో లేదో పరిశీలించటంతో పాటు ఇబ్బందులు రాకుండా చూడాలన్నారు.



సీఎంతో మాట్లాడుతున్న కోళ్ల నాగేశ్వరరావు

ఫైర్ డిపార్ట్‌మెంట్ కానిస్టేబుల్ ఔదార్యం

పాలకొల్లు అర్బన్, సెప్టెంబరు 4: భారీగా కురుస్తున్న వర్షాలవల్ల రోడ్డుపక్కన జీవనం వెళ్ళదీస్తున్న నిరాశ్రయులు వంద మందికి బుధవారం సాయంత్రం స్థానిక ఫైర్ డిపార్టుమెంట్‌లో కానిస్టేబు ల్‌గా పనిచేస్తున్న బీవీ రమణ భోజనాలను ఆయా ప్రాంతా లకు తీసుకెళ్లి అందించారు. గత ఏడాది శీతాకాలంలో పేదలకు భోజనాలు ఏర్పాటు, రగ్గులు పంపిణీ చేయడం వంటి కార్యక్రమాలను చేపట్టారు. తన స్వగ్రామం పెనుగొండ మండలం ములపర్రులో పేదలకు రెండు నెలలకు ఒకసారి వైద్యశిబిరాలు ఏర్పాటు చేసి ఉచితంగా మందులు అందజేస్తుంటారు. ఈ సందర్భంగా ఆయనను జిల్లా అగ్నిమాపక అధికారి బి.శ్రీనివాసరావు, పాలకొల్లు సహాయ జిల్లా అగ్నిమాపక అధికారి వైవీ జానకీరామ్, సిబ్బంది అభినందించారు.



పేదలకు భోజనాలు అందిస్తున్న కానిస్టేబుల్ రమణ






భీమవరంలో వినాయక ప్రతిమలు అందిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే అంజిబాబు, కొటికలపూడి గోవిందరావు.. రెస్ట్‌హౌస్ రోడ్‌లో వినాయక ప్రతిమల పంపిణీ.. నరసాపురంలో గణనాథ మట్టి ప్రతిమలు పంపిణీ చేస్తున్న క్లబ్ సభ్యులు

పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి

- జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి
- పలుచోట్ల మట్టి వినాయక ప్రతిమల పంపిణీ

భీమవరంటౌన్, సెప్టెంబరు 4 : పర్యావరణ పరిరక్షణకు సమష్టిగా కృషి చేయాలని, పర్యావరణాన్ని పరిర క్షించడంలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి సూచించారు. చైత్ర బిజినెస్ సొల్యుయేషన్స్, వెస్ట్ బెర్రీ స్కూల్, శ్రీభగవాన్ ట్రేడర్స్ ఆధ్వర్యంలో ఐదు వేల ఉచిత మట్టి వినాయక ప్రతిమలను జేపీ రోడ్డులోని శ్రీభగవాన్ ప్లాజా వద్ద కలెక్టర్ నాగరాణి, ఎమ్మెల్యే అంజిబాబు, జేసీ రాహుల్ కుమార్ రెడ్డి చేతులమీదుగా పంపిణీ చేశారు. ఎమ్మెల్యే పులపర్తి అంజిబాబు మాట్లాడుతూ గత పదకొండేళ్లుగా మట్టి వినాయక ప్రతిమల పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తున్న సుబ్బరాజును అభినందించారు. చెరుకువాడ రంగసాయి, నడింపల్లి మహేష్‌కుమార్‌వర్మ, నడింపల్లి వెంకటరామరాజు, గాదదిరాజు సుబ్బరాజు తదితరులు పాల్గొన్నారు.

- ప్రతిఒక్కరూ మట్టి వినాయక ప్రతిమలనే వాడాలని ఎమ్మెల్యే పులపర్తి అంజిబాబు అన్నారు. రెస్ట్‌హౌస్ రోడ్‌లో రక్తదల్ సేవా సంస్థ వ్యవస్థాపకుడు మంగదొడ్డి మహేంద్ర ఆధ్వర్యంలో మూడు వేల మట్టి వినాయక ప్రతిమలను ఎమ్మెల్యే అంజిబాబు చేతుల మీదుగా పంపిణీ చేశారు. జనసేన పార్టీ రాష్ట్ర ప్రొటోకాల్ ఛైర్మన్ మల్లినీడి తిరుమ లరావు, జనసేన జడ్పీటీసీ గుండా జయప్రకాష్ నాయుడు, జనసేన రాష్ట్ర లీగల్ సెల్ కార్యదర్శి ఉండపల్లి రమేష్ నాయుడు, జనసేన నాయకులు భీమాల శ్రీరామమూర్తి, కొప్పర్తి నరసింహారావు, విజ్జురోతి రాఘవులు, పడమటి రామకృష్ణ, జనసేన ఎంపీటీసీ తాతపూడి రాంబాబు, చల్లా రాము తదితరులు పాల్గొన్నారు.
- మార్నింగ్ కాఫీ క్లబ్ ఆధ్వర్యంలో డీఎన్నార్ కళాశాల రోడ్ తాడిమళ్ళ గిరి కాంప్లెక్స్ వద్ద మట్టి గణపతి విగ్రహం, గణపతి వ్రత పుస్తకం, పండ్లను ఎమ్మెల్యే అంజిబాబు చేతులమీదుగా అందించారు. మార్నింగ్ కాఫీ క్లబ్ కన్వీనర్ బొండా రాంబాబు, పీఆర్వో భట్టిప్రోలు శ్రీనివాసరావు, కారుమూరి సత్యనారాయణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.
- వాసవి జాగృతి ఇంటర్నేషనల్ క్లబ్ ఆధ్వర్యంలో, డాక్టర్ బీవీ రాజు, వీరమ్మ పార్కు వద్ద గణేష్ మట్టి ప్రతిమలను, చవితి వ్రతకల్ప పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాన్ని జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు కొటికలపూడి గోవిందరావు ప్రారంభించి మాట్లాడారు. క్లబ్ అధ్యక్షుడు పత్రిపాటి శ్రీను, వబిలిశెట్టి రామకృష్ణ, క్లబ్ ప్రధాన కార్యదర్శి సబ్బిశెట్టి గణేష్, ప్రసాద్, సంక అనంత గోపాలం తదితరులు పాల్గొన్నారు.
- నరసాపురం టౌన్ : నరసాపురం వనితా క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. బాల గణపతి ఆలయం వద్ద శిబిరాన్ని ఏర్పాటు చేసి 500 విగ్రహాలను అందించారు. పర్యావరణ పరిరక్షణకు మట్టి విగ్రహాలనే పూజించాలని ముఖ్య అతిథిగా విచ్చేసిన మహిళా కమిషన్ మాజీ సభ్యురాలు డాక్టర్ రాజ్యలక్ష్మి పిలుపునిచ్చారు. సుప్రజ, స్వర్ణలత, ఉషా కమల, భారతి, రాజకుమారి, నాగమణి, ఝాన్సీ పాల్గొన్నారు.

కిక్కిస సమస్యను సీఎం దృష్టికి తీసుకెళతా

దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని

ఆకివీడురూరల్, సెప్టెంబరు 4 : ఉప్పుటేరులో పేరుకుపోయిన కిక్కిస పరిస్థితిని సీఎం దృష్టికి తీసుకెళతానని ఏలూరు జిల్లా దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. దుంపగడప సమీపంలో ఉప్పుటేరుపై రైల్వే వంతెన వద్ద పేరుకుపోయిన కిక్కిస, గుర్రపుడెక్కను, రైల్వే వంతెనకు వేసిన స్తంభాలు వెడల్పు పరిశీలించారు. దీనివల్ల ఉండి, కైకలూరు, ఉంగుటూరు, ఏలూరు, దెందులూరు నియోజకవర్గాలు ముంపు బారిన పడతాయని, ఇదేవిషయాన్ని సీఎం చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకెళతానన్నారు. టీడీపీ మండల కార్యదర్శి నౌకట్ల రామారావు, ఎం.డి. జాకీర్, గంధం ఉమా, అజమాల్, రామరాజు, పమ్ము, టీడీపీ, జనసేన నాయకులు తదితరులున్నారు.



ఉప్పుటేరును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే చింతమనేని, తదితరులు

ప్రజాశ్రేయస్సే లక్ష్యం : ఎమ్మెల్యే రఘురామ

పాలకోడేరు, సెప్టెంబరు 4: ప్రజాశ్రేయస్సు, రైతు బాగోగులు చూడడమే లక్ష్యమని ఉండి ఎమ్మెల్యే కనుమూరి రఘురామకృష్ణ రాజు అన్నారు. పాలకోడేరు పీహెచ‌సీలో పదేళ్లుగా అసంపూర్తిగా నిలిచిన అదనపు గదిని అభివృద్ధి చేసి ఆ భవనాన్ని బుధవారం ప్రారంభించారు. అనంతరం గత ప్రభుత్వంలో అసంపూర్తిగా నిలిచిన పశువుల ఆసుపత్రిని అభివృద్ధి చేసి ఆ భవనాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. పీహెచ్‌సీ డాక్టర్ సీహెచ్‌వీ రంగంనాయుడు మాట్లాడుతూ అసంపూర్తిగా నిలిచిన గది నిర్మాణంపై ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్ళిన సత్వరమే అభివృద్ధి చేసి ప్రారంభించడంపైకృతజ్ఞతలు తెలిపారు. సొసైటీ బ్యాంకు మాజీ చైర్మన్ కొత్తపల్లి నాగరాజు, గ్రామ సర్పంచ్ ఇంజేటి మరియమ్మ, ఎంపీపీ భూపతిరాజు సత్యనారాయణరాజు, కునాధరాజు మురళీకృష్ణంరాజు, ఏడుకొండలరాజు, కామన రాంబాబు, కమ్మిలి రాంబాబు, గాదిరాజు సూర్యనారాయణరాజు, కూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



పాలకోడేరు పీహెచ్‌సీ అదనపు గదిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రఘురామ

అవార్డు గ్రహీత బాల ఈశ్వరయ్యకు సత్కారం

తాడేపల్లిగూడెం రూరల్, సెప్టెంబరు 4: దివ్యాంగ విద్యార్థుల భవిష్యత్ కోసం పాటుపడుతున్న ఎస్‌కే బాల ఈశ్వరయ్య సేవలు అభినందనీయమని మానవత స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు పత్సా వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పొందిన బాల ఈశ్వరయ్యను స్థానిక భవిత కేంద్రంలో బుధవారం సత్కరించారు. మానవత సభ్యులు చేకూరి బంగార్రాజు, యర్రా ఆంజనేయస్వామి, టి. పాండురంగారావు తదితరులు పాల్గొన్నారు.



ఈశ్వరయ్యను సత్కరిస్తున్న దృశ్యం

పశువులకు టీకాలు వేయించాలి

యలమంచిలి, సెప్టెంబరు 4: సీజనల్ వ్యాధుల బారిన పడకుండా పశువులకు టీకాలు వేయించాలని పశుసంవర్ధకశాఖ జిల్లా అధికారి డాక్టర్ కె.మురళీకృష్ణ పాడిరైతులకు సూచించారు. బుధవారం కనకాయలంక, పెదలంక గ్రామాల్లో ఆయన పర్యటించి అధికవర్షాలు కురుస్తుండడంతో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పాడిరైతులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ గురువారం నుంచి పశువులకు గాలికుంటువ్యాధి నిరోధక టీకాలు వేస్తామన్నారు. పశుసంవర్ధకశాఖ భీమవరం ఉపసంచాలకులు డాక్టర్ జవర్ హుస్సేన్, మండల పశువైద్యాధికారి పి.చంద్రశేఖరరెడ్డి, పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు ఘన సత్కారం

పాలకొల్లు అర్బన్, సెప్టెంబరు 4: పట్టణంలోని వీవర్స్ కాలనీలోని జీవీఎస్‌వీఆర్‌ఎం మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో గురుపూజోత్సవం సందర్భంగా పలువురు ఉపాధ్యాయులను సత్కరించారు. సప్తనిధి క్లబ్ ఫౌండర్ చైర్మన్ స్వామినాయుడు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం ఆర్.భవానీ ప్రసాద్‌ను, నారాయణరావు, ఉన్నమట్ల చిన్నయ్య తదితరులను ఘనంగా సత్కరించి, జ్ఞాపికలు అందజేశారు. సప్తనిధి క్లబ్ బ్రాంచ్ మేనేజర్ హేమచంద్రరావు, రాంకీ రెడ్డి, డీవో పిల్లి కిరణ్‌కుమార్, సిబ్బంది, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బీజేపీ బలోపేతానికి సభ్యత్వ నమోదు

పాలకొల్లుఅర్బన్, సెప్టెంబరు 4 : నరసాపురం పార్లమెంట్ పరిధిలోని పశ్చిమ గోదావరి జిల్లాలో బీజేపీ బలోపేతానికి గానూ పార్టీ సభ్యత్వనమోదు కార్యక్రమాలను చేపట్టినట్టు బీజేపీ పట్టణ అధ్యక్షుడు జక్కంపూడి కుమార్ తెలిపారు. బుధవారం భీమవరం పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో కేంద్ర మంత్రి బీహెచ్ శ్రీనివాసవర్మ పట్టణ శాఖ అధ్యక్షుడు జక్కంపూడి కుమార్ సభ్యత్వాన్ని రిఫరల్ లింక్ ద్వారా నమోదు చేసి కార్యక్రమాన్ని ప్రారంభించినట్టు కుమార్ తెలిపారు. నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తాళ్లకోడులో ఇళ్లు నిర్మించాకే ఖాళీ చేస్తాం

- సీపీఎం నేతలతో కలిసి ఆక్రమణదారుల ఆందోళన
- నగర పంచాయతీ సిబ్బంది ఆధ్వర్యంలో నోటీసులు అందజేత

ఆకివీడు, సెప్టెంబరు 4 : తాళ్లకోడులో ఇళ్ల స్థలం ఇచ్చి ఇళ్లు నిర్మించిన తరువాత ఖాళీ చేస్తామని అయి-భీమవరం రోడ్ కార్మికనగర్‌లోని మూలలంకబోదె పక్కన నివాసితులు సీపీఎం నాయకులతో కలిసి ఆందోళన చేశారు. ఆక్రమణలు ఖాళీ చేయాలంటూ నగర పంచాయతీ సిబ్బంది పోలీసుల సాయంతో తహసీల్దార్ నందూరి వెంకటేశ్వరరావు, నగర పంచాయతీ మేనేజర్ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో వారం రోజుల్లో ఇళ్లు ఖాళీ చేయాలని నోటీసులు అందజేశారు. స్థానికులు మాట్లాడుతూ ఓవైపు వరదలు, వర్షాలతో ప్రజలు అల్లాడుతుంటే తాము ఎక్కడకు వెళ్ళి తలదాచుకోవాలని ప్రశ్నించారు. నోటీసులు తీసుకోకపోవడంతో పాటు అంటిస్తుండగా అడ్డుపడుతున్నందున పోస్టు ద్వారా పంపించి ఇళ్లను తొలగిస్తామని అధికారులు ఆదేశించారు. కార్యక్రమంలో పోలీసులు, మహిళా పోలీసులు, రెవెన్యూ, నగర పంచాయతీ సిబ్బంది ఉన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న సీపీఎం శ్రేణులు, ఆక్రమణదారులు

గణపవరం ఎస్ఐగా మణికుమార్ బాధ్యతలు

గణపవరం, సెప్టెంబరు 4:గణపవరం పోలీస్‌స్టేషన్ ఎస్ఐగా ఎ.మణికుమార్ బాధ్యతలు స్వీకరించారు. ఏలూరు జిల్లా చేబ్రోలు ఎస్ఐగా బాధ్యతలు నిర్వహించిన ఆయన బదిలీపై బుధవారం సాయంత్రం గణపవరం ఎస్ఐగా బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఎస్ఐగా పనిచేసిన వి.వెంకటేశ్వరరావు బదిలీపై వెళ్ళారు. గణపవరం, పిప్పరలో ప్రధానంగా ట్రాఫిక్ సమస్య అధికంగా ఉందని దీనిపై ప్రత్యేక దృష్టి తీసకుంటామని తెలిపారు.

మొగల్తూరు సొసైటీపై 51వ విచారణ

మొగల్తూరు, సెప్టెంబరు 4 : మొగల్తూరు సహకార సంఘంపై 51వ విచారణకు ప్రభుత్వం ఆదేశించినట్టు తెలిసింది. గత ప్రభుత్వ హయాంలో సంఘ ఆడిట్ అధికారులు ఆదేశాలతో 51వ విచారణ చేపట్టారు. విచారణ నిలుపుదల చేసేందుకు కోర్టు స్టే కోరుతూ నాటి పాలకవర్గం ప్రయత్నించగా కోర్టు నిరాకరించింది. దీంతో గత ప్రభుత్వ మంత్రి నుంచి స్టే తెచ్చుకున్నారు. అప్పటి నుంచి విచారణ నిలుపుదల చేశారు. ఇటీవల రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడడంతో సంఘంలో నిలిచిన విచారణను తిరిగి చేపట్టే విధంగా చర్యలు తీసుకోవాలని పలువురు ఫిర్యాదుదారులు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్ళారు. దీనిపై జిల్లా సహకార అధికారులను సంప్రదించగా మొగల్తూరు సహకార సంఘంపై నిలిచిన 51 విచారణ స్టేను ప్రభుత్వం ఉపసంహరించుకుందని తిరిగి విచారణ ప్రారంభిస్తున్నట్టు సహకార అధికారులు తెలిపారు.

కాల్వల ప్రవాహాలపై దృష్టి పెట్టాలి : తహసీల్దార్

పోడూరు, సెప్టెంబరు 4 : భారీ వర్షాలు కురిసి వరదలు వస్తున్నందున పంట కాల్వలు, మురుగు డ్రెయిన్‌లు, నీటి ప్రవాహాలపై ప్రజాప్రతినిధులు, అధికారులు దృష్టి పెట్టాలని పోడూరు తహసీల్దార్ మహ్మద్‌సయ్యద్ ఫాజిల్ కోరారు. బుధవారం జరిగిన పోడూరు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ సబ్బితి సుమంగళి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల నక్కల డ్రెయిన్ పరిధిలో వద్దిపర్రు వంతెనం వద్ద గుర్రపుడెక్క, తూడు అడ్డుపడడంతో డ్రెయిన్‌లో నీటిప్రవాహం నిలిచిపోయిందని సర్పంచ్ రాజేంద్రప్రసాద్‌కు చెందిన ఎక్స్‌కవేటర్ సాయంతో తొలగింపు పనులు చేపట్టి పరిస్థితి చక్కదిద్దామన్నారు. మండంలోని అన్ని కాల్వలపై దృష్టిపెట్టి నీటిప్రవాహనికి అడ్డుపడే తుక్కుతూడును తొలగించి వరద రాకుండా చూడాలని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులకు సూచించారు. అనంతరం జడ్పీటీసీ గుంటూరి పెద్దిరాజు మాట్లాడారు. అయాశాఖల అధికారులు శాఖల అభివృద్ధి పనులను వివరించారు. వైస్ ఎంపీపీలు ఇందుకూరి సీతారామరాజు, గుబ్బల సత్యనారాయణ, ఎంపీడీవో డి.సుహాసిని, సివిల్ సప్లయ్ డీటీ డి.సత్యనారాయణ అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తహసీల్దార్ మహ్మద్ సయ్యద్ ఫాజిల్

క్లబ్ సేవల్ని మరింత విస్తృతం చేయాలి

నరసాపురం టౌన్, సెప్టెంబరు 4:క్లబ్ సేవల్ని మరింత విస్తృతపర్చాలని వాసవీ క్లబ్‌గోల్డ్ ఇంటర్నేషనల్ అధ్యక్షుడు ఆర్.రవిచంద్రరన్ పిలుపునిచ్చారు. బుధవారం పట్టణంలోని అప్పనప్లాజాలో జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేశారు. సేవాకార్యక్రమాలు చేసిన వారిని ఘనంగా సత్కరించారు. అనంతరం కటకం నాగలక్ష్మి, సలాది సావిత్రి, ఈ.భ్రమరాంబ చేత ప్రమాణస్వీకారం చేయించారు. కార్యక్రమంలో నూలి వెంకటరమణమూర్తి, ఎల్ఎస్‌వీ ప్రసాద్, చక్క శ్రీనివాసరావు, వంకాయల వెంకట రవికుమార్, సమయమంతుల సర్వేశ్వరరావు, కారుమూరి సుబ్రమణ్యం, సలాది శ్రీనివాసరావు, వెంకటరామయ్య పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగిపై దాడి.. కేసు నమోదు

మొగల్తూరు, సెప్టెంబరు 4 : మొగల్తూరు గ్రామ పంచాయతీ పరిధి ఒకటో గ్రామ సచివాలయంలో వెల్ఫేర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న కొల్లు దుర్గాప్రసాద్‌పై బుధవారం నలుగురు వ్యక్తులు దాడిచేశారు. మొగల్తూరు జాతీయ రహదారి వైజంక్షన్ నుంచి బైక్‌పై వస్తున్న అతడిని కడలివారిపాలెంకు చెందిన నలుగురు యువకులు దారి కాచి బైక్ రోడ్డుపై పెట్టి హెల్మెట్‌తో కొట్టారు. దీనిపై బాధితుడు ఫిర్యాదు మేరకు నలుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ జి.వాసు తెలిపారు.

500 మందికి ఉచిత వైద్య పరీక్షలు

నరసాపురం, సెప్టెంబరు 4:గ్రంధి విజయలక్ష్మి, సత్యనారాయణ ట్రస్టు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత కేన్సర్ నిర్ధారణ శిబిరంలో పలువురు గైనకాలజిస్టులు సుమారు 500 మందికి పరీక్షలు చేశారు. బుధవారం ఈ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే నాయకర్ ప్రారంభించి మాట్లాడారు. తల్లిదండ్రుల జ్ఞాపకార్థం పదకొండేళ్లుగా మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించడం అభినందనీయమన్నారు. టీడీపీ నాయకులు కొవ్వలి నాయుడు మాట్లాడుతూ ఈ రోజుల్లో కూడా కొంతమంది వైద్యులు ఉచితంగా శిబిరాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. డాక్టర్ పద్మావతి, డాక్టర్ మురళి, డాక్టర్ జ్యోతి రాణి పాల్గొన్నారు.

రెండు వేల మొక్కల వితరణ

అత్తిలి, సెప్టెంబర్ 4 : విశ్వవిజ్ఞాన విద్యా ఆధ్యాత్మిక పీఠం ఉమర్ అలీషా రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్టు అత్తిలి శాఖ ఆధ్వర్యంలో జనసేన నాయకులకు రెండు వేల మొక్కలను అందజేశారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పుట్టిన రోజు సందర్భంగా జనసేన నాయకులు అత్తిలి గ్రామంలో రోడ్ల పక్కన బుధవారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా జనసేన తణుకు నాయకుడు అణుకుల రమేష్ మాట్లాడుతూ ఉమర్ అలీషా ట్రస్టు సేవా కార్యక్రమాలు అభినందనీయమన్నారు. ట్రస్టు ద్వారా వేసవిలో చలివేంద్రాలు, మెడికల్ క్యాంపులు నిర్వహించి పేదలకు అండగా నిలుస్తున్నారని చెప్పారు. జనసేన నాయకులు, ఉమర్ అలీషా పీఠం సభ్యులు పాల్గొన్నారు.



మొక్కలు అందిస్తున్న ఉమర్ అలీషా పీఠం సభ్యులు

సీపీఎం నుంచి అంజిబాబు బహిష్కరణ

ఆచంట, సెప్టెంబరు 4 : సీపీఎం క్రమశిక్షణకు అనైతిక ప్రవర్తన విలువలు ప్రమాణాలకు భిన్నంగా దిగజారి ప్రవర్తిస్తున్న సీపీఎం మండల కమిటీ సభ్యులు వద్దిపర్తి అంజిబాబును పార్టీ నుంచి బహిష్కరిస్తున్నట్లు పార్టీ మండల కమిటీ బుధవారం ఓ ప్రకటనలో తెలిపింది. ఇక నుంచి పార్టీ కార్యక్రమాలకు ఎటువంటి సంబంధం లేదని పేర్కొంది. పార్టీ మండల కమిటీ సభ్యులుగా ఉంటూ వేరే పార్టీలోకి వెళ్లే ప్రయత్నాలు చేస్తున్న దృష్ట్యా విచారణ చేసి నిజ నిర్ధారణకు వచ్చిన తరువాతనే చర్యలు తీసుకున్నట్లు పార్టీ మండల కమిటీ పేర్కొంది.